ఆయుర్వేదం.. సేవలకు దూరం

- ఆకుమల్లలో ఆయుర్వేద వైద్య సేవలు దూరం
- వైద్యుడి నియమకం చేయకపోవడంతో నిరుపయోగం
- దృష్టిసారించని అధికారులు



ఆకుమల్ల పీహెచ్‌సీ ఆస్పత్రి గోడపై బోర్డుకే పరిమితమైన ఆయుర్వేద విభాగం

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామంలో ఆయుర్వేదం వైద్యానికి ప్రజలు దూరం అయ్యారు. ఆస్పత్రి ఎక్కడ ఉంది? డాక్టర్ ఎక్కడ ఉన్నారు అనేది ఎవరికీ తెలియని పరిస్థితి. మారుతున్న కాలంలో ఆయుర్వేదంపై ప్రజల్లో ఆసక్తి పెరిగింది. అల్లోపతి మందులకు సైడ్ ఎఫెక్స్ ఉంటాయనే ఉద్దేశంతో కొందరు ఆయుర్వేద చికిత్సకు మొగ్గు చూపుతున్నారు. ఆకుమల్లలో గతంలో ప్రభుత్వం ఆయుర్వేద వైద్యశాల ఏర్పాటు చేసింది. కొద్ది రోజులు సేవలు అందించినా ఆ తర్వాత అసలు సమస్య మొదలైంది. ఇక్కడ పనిచేయడానికి వైద్యులు ఆసక్తి చూపక పోవడంతో ఎవరూ ఉండడం లేదు. అసలు ఈ కేంద్రం పనిచేస్తుందా లేదా కూడా స్పష్టత లేదు. కొందరు రోగులు కేంద్రానికి వచ్చి వైద్యులు లేక తిరుగుముకం పడుతున్నారు. మరికొందరు ఆకుమల్ల గ్రామంలో ఆయుర్వేదం ఆస్పత్రి ఉందా అనే సందేహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతానికి ఆకుమల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓ గొడపై ఆయుర్వేద వైద్యశాల అని బోర్డు ఉంది కానీ వైద్యులు లేరు. పీహెచ్‌సీలో ఆయుర్వేదం డాక్టర్స్ గురించి సమాచారం అడిగితే కేవలం బోర్డు మాత్రమే ఉంది కానీ వైద్యుల వివరాలు తమకు తెలియదు అనే సమాధానం వినపడుతోంది.



ఆస్పత్రి ఉన్నా వైద్యులు లేరు

ఆకుమల్ల గ్రామంలో ఆయుర్వేం ఆస్పత్రి ఉంది కానీ వైద్యులు లేక మూతపడింది. 2020 సంవత్సరంలో ఇక్కడ పనిచేస్తున్న వైద్యురాలు అవుకు మండలం గుండ్లసింగవరం గ్రామానికి బదిలీ అయ్యారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఇక్కడ వైద్యుడిని నియమించలేదు. దీంతో గ్రామస్తులు ఆయుర్వేదం వైద్యానికి దూరం అయ్యారు. వైద్యశాఖ ఉన్నతాధికారులు స్పందించి వైద్యుడిని నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

వైద్యులను నియమించాలి



ఆకుమల్ల గ్రామంలోని ఆయుర్వేం ఆస్పత్రికి చుట్టుపక్కల గ్రామాల నుంచి వస్తున్నారు. డాక్టర్స్ లేక వెనక్కి వెళ్తున్నారు. మాది అవుకు మండలం శివవరం గ్రామం. మేము ఆయుర్వేదం ఆస్పత్రికి వెళ్లాలంటే అవుకు మండలం గుండ్ల శింగవరానికి వెళ్లాల్సి ఉంటుంది. అది 15 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఆకుమల్ల గ్రామం 5 కిలోమీటర్ల దూరం ఉంది. ఇక్కడ వైద్యులను నియమిస్తే సౌకర్యంగా ఉంటుంది.
–రమణయ్య, శివవరం, అవుకు మండలం

అధికారులు చర్యలు తీసుకోవాలి



ఆయుర్వేద వైద్యశాలలో వైద్యులు లేక రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఆయుర్వేదంపై పలువురు దీర్ఘకాలిక రోగులు ఆధారపడ్డారు. ఇంగ్లిష్ మందులకు నయం కానిది ఆయుర్వేదం మందులతో నయం అవుతుందని ప్రజల నమ్మకం. ప్రభుత్వం రోగులను దృష్టిలో ఉంచుకుని ఆయుర్వేదం వైద్యులను నియమించాలి.
–జి.నాగేశ్వర్‌రెడ్డి, సొసైటి బ్యాంక్ మాజీ చైర్మన్, ఆకుమల్ల

ఆయుర్వేదం అంటే నమ్మకం



ఆయుర్వేదం వైద్యంతో రోగాలు నయం అవుతాయని మా నమ్మకం. ప్రస్తుత కాలంలో కీళ్లనొప్పులు, శ్వాస సంబంధ సమస్యలతో చాలా మంది తరచూ ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి వాటికి ఆయుర్వేదం అయితే మంచి ఫలితం ఉంటుందని నమ్ముతున్నాం. ఆయుర్వేదం వైద్యులు ఆకుమల్లలో లేక ఇబ్బంది పడుతున్నాం. వైద్యులను ఎప్పుడు ఏర్పాటు చేస్తారని ఎదురు చూస్తున్నాం.
–నరసింహుడు, ఆకుమల్ల గ్రామం

క్లుప్తంగా

వివాహ వేడుకలో కాటసాని



వివాహ వేడుకలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: పట్టణంలోని జీఎస్‌ఎస్ ఫంక్షన్ హాల్‌లో శని, ఆదివారాల్లో జరిగిన హనుమంతరాయ ఎడ్యుకేషనల్ సొసైటీ ఏఓ గూటూరు సురేష్‌కుమార్ తనయుడు సాహిత్ వివాహ వేడుకలో వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు. వారి వెంట అవుకు ఎంపీపీ చల్లా రాజశేఖర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, పార్టీ లీగల్ సెల్ న్యాయవాది అబ్దుల్‌ఖైర్, డాక్టర్ రవికుమార్ తదితరులు ఉన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



రంగాపురం గ్రామంలో కూల్చివేస్తున్న నిర్మాణాలు

బేతంచెర్ల: ఓర్వకల్లు మండలం సోమయాజుపల్లె నుంచి బేతంచెర్ల మండలం మీదుగా డోన్ వరకు రూ.650 కోట్లతో 340 (బీ) జాతీయ రహదారి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. బేతంచెర్ల మండల పరిధిలోని రంగాపురం గ్రామంలో జాతీయ రహదారి నిర్మాణానికి అడ్డుగా ఉన్న అక్రమ నిర్మాణాలను అధికారులు, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పర్యవేక్షణలో ఆదివారం కూల్చి వేశారు. గ్రామంలోని గూటుపల్లె రహదారిలో ఉన్న పెద్దరాజుస్వామి దర్గా ముఖ ద్వారంను కూల్చి వేయడంతో పాటు వైఎస్సార్ విగ్రహాన్ని తొలగించి పశు వైద్యశాల ఆవరణలో ఉంచారు.

బీసీ బాలుర వసతి గృహం తనిఖీ



భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న బాల గంగన్న

సంజామల: మండల కేంద్రం సంజామల బీసీ బాలుర వసతి గృహాన్ని ఎస్సీ, ఎస్టీ సెల్ జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బోధనం బాల గంగన్న ఆదివారం తనిఖీ చేశారు. వసతి గృహంలో విద్యార్థుల మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా అని పరిశీలించారు. ఈ సందర్భంగా బాల గంగన్న మాట్లడుతూ.. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. హాస్టల్‌లో మంచాలు అందుబాటులో ఉన్నా వినియోగించడంలేదని గుర్తించారు. వినియోగించుకునేలా చూడాలని వార్డన్‌కు సూచించారు. ఆయన వెంట మద్దిలేటి, వెంకటరాముడు ఉన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

బేతంచెర్ల: రౌడీషీటర్లు గొడవలు, నేరాలకు దూరంగా ఉంటూ శాంతియుత జీవితం గడపాలని సీఐ డి.వెంకటేశ్వరరావు సూచించారు. ఆదివారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని రౌడీషీటర్లకు ఎస్‌ఐ రమేష్ బాబుతో కలిసి కౌన్సిలింగ్ నిర్వహించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. నాటుసారా, అక్రమ మద్యం, పేకాట, మాట్కా జోలికి వెళితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలో క్షణికావేశంలో చేసిన తప్పులు మరలా పునరావృతం కాకుండా చూసుకోవాలని, లేకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని స్పష్టం చేశారు.

శివస్వాములకు భిక్ష



స్వాములకు అన్నం వడ్డిస్తున్న ముస్లింలు

బేతంచెర్ల: స్థానిక నంద్యాల రహదారిలోని దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో శివస్వాములకు మతసామరస్య చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ముస్లింలు భిక్ష కార్యక్రమం నిర్వహించారు. వేదిక అధ్యక్ష, కార్యదర్శులు నూర్ అహ్మద్, జయంత్ గౌడ్, సభ్యులు దస్తగిరి, రశీద్ మాట్లాడుతూ.. ఎవరి మతం వారు అనుసరిస్తూ ఇతర మతాలను గౌరవించడమే మతసామరస్యం అన్నారు. కులమతాలకు తారతమ్యం వీడి భారతీయులందరూ దేశసమగ్రత పటిష్టత కోసం పాటుపడాలన్నారు.

వ్యవసాయానికి ఈవారం విద్యుత్ వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ అనంతరావు తెలిపారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, జోళదరాశి, కలుగొట్ల, అల్లూరు, కొత్తపల్లె గ్రామాలకు సంబంధించి ఉదయం 7.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, రేవనూరు, లింగాల, గుండుపాపల గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

బెల్టు షాపులపై చర్యలేవి?



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

డోన్ టౌన్: స్థానిక ఎమ్మెల్యే, షాడో మంత్రి అనుచరుల బెల్టు షాపులపై ఎక్సైజ్ పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని సీపీఎం మండల, పట్టణ కార్యదర్శులు కొయికొండ నాగరాజు, నక్కి శ్రీకాంత్, చిన్నరహిమాన్ ప్రశ్నించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో బెల్టు షాపులు నిర్వహిస్తే తాట తీస్తామని సీఎం చెబుతుంటే ఆ పార్టీకే చెందిన ఎమ్మెల్యే, షాడో మంత్రి మాత్రం విచ్చలవిడిగా వారి అనుచరులతో నెలకు రూ.20వేల నుంచి రూ.40వేల వరకు కప్పం కట్టించుకుని సందుకో బెల్టు షాపు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఇంత జరుగుతున్నా ఎక్సైజ్ సిబ్బంది ఎందుకు మౌనం వహిస్తున్నారన్నారు.

16 వాహనాలు సీజ్



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ

కోవెలకుంట్ల: పట్టణంలోని పూసల బజార్‌లో ఆదివారం కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కాలనీలో రికార్డులు సరిగ్గా లేని 10 ఆటోలు, ఆరు బైక్‌లు సీజ్ చేశారు. అనంతరం కాలనీవాసులతో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు జరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు ఎవరైనా కన్పిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. కోవెలకుంట్ల, సంజామల ఎస్‌ఐలు మల్లికార్జునరెడ్డి, రమణయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సిమెంట్ నగర్‌లో కార్డన్ సెర్చ్

బేతంచెర్ల: మండల పరిధిలోని సిమెంట్ నగర్ గ్రామంలో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ డి.వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ రమేష్‌బాబు, పోలీసులు గ్రామంలోని 26 మంది అనుమానితుల ఇళ్లను తనిఖీ చేశారు. రికార్డులు లేని ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గొడవలు, అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సూచించారు.



గ్రామంలో అనుమానితుల ఇళ్లను తనిఖీ చేస్తున్న పోలీసులు



ప్రజలతో మాట్లాడుతున్న సీఐ రమేష్‌బాబు

గొర్విమానుపల్లెలో కార్డన్‌సెర్చ్

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని గొర్విమానుపల్లెలో ఆదివారం సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. పలు రాజకీయ పార్టీల నాయకులు, రౌడీషీటర్లు, అనుమానితుల ఇళ్లలో తనిఖీలు చేశారు. సరైన రికార్డులు లేని పది వాహనాలను సీజ్ చేశారు. చిన్న విషయాలకు గొడవలకు పాల్పడకుండా ప్రశాంతంగా ఉండాలని సీఐ సూచించారు. గ్రామంపై పోలీసుల నిఘా ఉంటుందన్నారు. అల్లర్లకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

స్నేహితుడికి ఆర్థిక సాయం

బనగానపల్లె రూరల్: అవుకు మండలం గుండ్లశింగవరం జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి అశోక్‌కు స్నేహితులు ఆర్థిక సాయం చేసి స్నేహభావాన్ని చాటుకున్నారు. ఆదివారం స్థానిక పీఆర్‌టీయూ కార్యాలయంలో తోటి స్నేహితులు, విద్యార్థుల నుంచి సేకరించిన రూ.40 వేలను ఉపాధ్యాయుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు రాంపుల్లారెడ్డి, రఘునాథ్, బాలమద్దిలేటి మాట్లాడుతూ.. గత నెల పొలం పనులకు వెళ్లిన అశోక్‌ను పాము కాటువేయడంతో చికిత్సకు రూ.6 లక్షలు ఖర్చు అయ్యిందని తెలిపారు. అతనితో పాటు పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు విరాళాలు సేకరించి అందజేయడం అభినందనీయమన్నారు. సతీష్‌కుమార్‌రెడ్డి, రామచంద్రుడు, మధుభాస్కర్, మహేంద్ర పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు, స్నేహితులు

శానిటేషన్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



నూతన కమిటీతో యూనియన్ నాయకులు

బనగానపల్లె రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ వైద్యశాలల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లకు ప్రభుత్వ జీఓ ప్రకారం రూ.16 వేల వేతనం చెల్లించాలని ఏపీ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుశీలమ్మ కోరారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షురాలిగా మట్ట చెన్నమ్మ, అధ్యక్షురాలిగా మట్ట రత్నమ్మ, ప్రధాన కార్యదర్శిగా నట్టల రామలక్ష్మమ్మ, సభ్యులుగా ఎం.కుమారి, రాణి, గౌసియా, షేక్ ఖాజాబి, కె.మరియమ్మ, ఎర్రకొండ సుధాకర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ.. వైద్యశాలల్లో శానిటేషన్ విభాగంలో పనిచేసే కాంట్రాక్టు వర్కర్లకు నిబంధల మేరకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

కొమ్మ కొమ్మకు పూత..!

బేతంచెర్ల: మండలంలోని మామిడి తోటల్లో ఈ ఏడాది ఆలస్యంగా ఫిబ్రవరి నెల ప్రారంభం నుంచి పూతలు వచ్చాయి. యంబాయి, శంకాలపురం, మండ్లవానిపల్లె, రుద్రవరం, ఆర్‌ఎస్ రంగాపురం, గూటుపల్లె, ముసలాయిచెర్వు గ్రామాల్లో మామిడి తోటలు ఎక్కువగా ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో చిన్న చెట్లు మొదలుకొని పెద్ద వృక్షాల వరకు ఆకులు కనపడకుండా కొమ్మ కొమ్మకు పూత అన్నట్లుగా విరగభూసాయి. ఆ పూత పిందెలుగా మారి మామిడి దిగుబడి వస్తే రైతన్నల పంట పండినట్లే. ఆలస్యంగా పూతరావడం.. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో పూత నిలుస్తుందా అన్న సందేహం రైతుల్లో నెలకొంది.



రంగాపురంలో ఆకులు కానరాకుండా వచ్చిన మామిడి పూత



యంబాయిలో విరగబూసిన పూత

నేటి నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్: ప్యాపిలి మండలం జలదుర్గం సబ్‌స్టేషన్ పరిధిలోని రామకృష్ణాపురం ఫీడర్‌లో కొత్తగా 11 కేవీ లైన్ నిర్మాణం చేపడుతున్న కారణంగా సోమవారం నుంచి మూడు రోజుల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వినయ్ కుమార్ తెలిపారు. రామకృష్ణాపురం, మాధవరం, గార్లదిన్నె గ్రామాల్లో సోమవారం నుంచి బుధవారం వరకు ప్రతి రోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే వ్యవసాయానికి ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు అవసరం



క్రీడా పోటీల్లో బహుమతులు అందుకున్న విద్యార్థులు

బేతంచెర్ల: విద్యార్థులకు చదువుతోపాటు మానసిక ఉల్లాసానికి ఆటలు కూడా అవసరం అని అనంతపురం జిల్లాకు చెందిన ప్రముఖ గుండె వైద్య నిపుణుడు రామ్ మోహన్, ఆంధ్రప్రగతి బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలోని ప్రకృతి విద్యానికేతన్‌లో ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ రవికుమార్‌రెడ్డి, పక్కిరెడ్డి, ఇందిరాదేవి పాల్గొన్నారు.

మహిళపై దాడి.. ముగ్గురిపై కేసు

బేతంచెర్ల: పట్టణంలోని కోటపేట కాలనీకి చెందిన మహిళను అదే కాలనీకి చెందిన ముగ్గురు దాడి చేసి గాయపరిచారు. పోలీసుల వివరాల మేరకు.. కోటపేట కాలనీకి చెందిన పూసల వెంకటమ్మను అదే కాలనీకి చెందిన సుబ్బమ్మ, మహేష్, బాబు వ్యక్తిగత మనస్పర్థలను దృష్టిలో ఉంచుకుని గొడవ పెట్టుకున్నారు. మాటమాట పెరగడంతో దాడి చేసి గాయపరిచారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖరప్ప తెలిపారు

ఆస్పత్రిలో పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో రోగులకు దాతల ఆర్థిక సహాయంతో ప్రార్థన సమయం నిర్వాహకుడు జాన్ ప్రభాకర్ ఆదివారం గుడ్డు, రొట్టె, పప్పును పంపిణీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన వరప్రసాద్

పాణ్యం: మండల పరిధిలోని కొలురు–భూపనపాడు మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి.. స్థానికుల వివరాల మేరకు.. బనగానపల్లె మండలం రామతీర్థం గ్రామానికి చెందిన వెంకట వరప్రసాద్ బైక్‌పై వెళ్తుండగా అదుపుతప్పి కిందపడడంతో ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు




దేవతామూర్తులకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం, కోలాటం ఆడుతున్న మహిళలు

కోవెలకుంట్ల: మండలంలోని చిన్నకొప్పెర్లలో జీర్ణోద్ధరణ గావించిన శివకేశవ ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. రెండో రోజు ఆదివారం వేద పండితుల ఆధ్వర్యంలో వేదపారాయణం, రుద్రాభిషేకం, రుద్రహోమం, దీక్షా హోమాలు, దేవతామూర్తుల గ్రామోత్సవం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల్లో చివరి రోజు యంత్ర, విగ్రహ, ప్రాణప్రతిష్ట, బలిదానం, మహాపూర్ణాహుతి, తదితర కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.




ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

మసీదు ప్రారంభం

డోన్ టౌన్: పట్టణంలోని వైఎస్ నగర్ సమీపంలో నూతనంగా నిర్మించిన మసీదును ఆదివారం ముస్లింలు మతపెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రారంభించారు. పట్టణానికి చెందిన పారిశ్రామికవేత్త ఖాజా మోహిద్దీన్ తన తల్లిదండ్రులైన కరీంఖాన్, సీమాబీ జ్ఞాపకార్థం రూ.కోటి ఖర్చు చేసి అన్ని హంగులతో మసీద్‌ను నిర్మించారు. జమ్ములమడుగుకు చెందిన మతపెద్ద కరిముల్లా ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రవక్త బోధనలు వినిపించారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు కమాల్‌బాషా, ముర్తుజా, రెహమాన్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.



నూతన మసీదు



బనగానపల్లెలో శిథిలావస్థకు చేరుకున్న సబ్‌ట్రెజరీ కార్యాలయం

శిథిలావస్థలో ప్రభుత్వ భవనం

బనగానపల్లె: బనగానపల్లె సంస్థానాన్ని నవాబులు పరిపాలించే కాలంలో నిర్మించిన సబ్‌ట్రెజరీ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని అధికారులు, ఉద్యోగులు భయందోళన చెందుతున్నారు. నవాబుల పరిపాలనలో పట్టణంలో తహసీల్దార్ కార్యాలయం, ట్రెజరీ కార్యాలయం ఒకేచోట ఏర్పాటు చేశారు. తహసీల్దార్ కార్యాలయం పతనావస్థకు చేరడంతో ఐదేళ్ల క్రితం నూతన భవనం ఏర్పాటు చేసి అక్కడికి మార్పుచేశారు. సబ్‌ట్రెజరీ కార్యాలయం మాత్రం పాత భవనంలోనే నిర్వహిస్తున్నారు. నూతన భవన నిర్మాణానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినా స్పందన లేదు. ఉన్నతాధికారులు భవన దుస్థితిని పరిశీలించి నిధులు మంజూరు చేయాలని స్థానిక అధికారులు కోరుతున్నారు. ప్రతి రోజు ఈ కార్యాలయానికి పనుల నిమిత్తం రిటైర్డ్ ఉద్యోగులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు ఎక్కువ సంఖ్యలో వస్తుంటారు. ఎప్పుడు ఏం జరుగుతుందోననే ఆందోళన నెలకొంది.

ప్రతిపాదనలు పంపాం



పట్టణంలోని సబ్‌ట్రెజరీ కార్యాలయం చాలా పురాతనమైంది. ప్రస్తుతం పతనావస్థకు చేరింది. విధులు నిర్వహించడానికి ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. నూతన భవన నిర్మాణానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరుకాగానే నూతన భవనాన్ని నిర్మిస్తాం. –కె.శ్రీనివాసులు, సబ్ ట్రెజరీ ఆఫీసర్, బనగానపల్లె